క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రం తనిఖీ


తనిఖీలో డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం సత్యనారాయణపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి తనిఖీ చేశారు. విధిగా పిల్లలకు టీకా వేయించాలని ఆమె వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం గర్భిణి సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ మీనాకుమారి, వైద్యాధికారి రేఖ ఉన్నారు.

పంచాయతీకి రూ 3.36 లక్షల ఆదాయం

బంగారుపాళెం: చేపల పెంపకానికి చెరువు లీజు వేలం ద్వారా గ్రామ పంచాయతీకి రూ.3.36 లక్షల ఆదాయం వచ్చినట్లు జంబువారిపల్లె గ్రామ కార్యదర్శి మధు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం సర్పంచ్ అమర అధ్యక్షతన వెంకటప్ప నాయుని చెరువు లీజు బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఎర్రాండ్లపల్లెకు చెందిన హరికృష్ణ రూ.3.36 లక్షలకు చెరువు లీజు హక్కును పొందారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న వైద్యులు

యాదమరి: వైద్య సిబ్బంది గ్రామాల్లో క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సంతగేటు వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని పాపిశెట్టి కండిగ గ్రామంలో బుధవారం ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మాతాశిశు మరణాలు పూర్తిగా నిర్మూలించేందుకే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గర్భవతులకు, చంటి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్ కోర్టు ప్రారంభం

పలమనేరు: పట్టణంలోని శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన వాలీబాల్ కోర్టును కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి శ్రీపురం సీతారామయ్య బుధవారం ప్రారంభించారు. ఈ నెల 15 నుంచి స్థానిక మైదానంలో అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్న నేపథ్యంలో కొత్త కోర్టును వేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయశేఖరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మునిసిపల్ క్వార్టర్స్‌పై ప్రభుత్వం సానుకూలం


మాట్లాడుతున్న సంఘం నేత గోవిందుడు

చిత్తూరు అర్బన్: సుదీర్ఘకాలంగా మునిసిపాలిటీలో పనిచేస్తూ, ఇంటి అద్దె చెల్లించిన ఉద్యోగులకు క్వార్టర్స్‌ను అప్పగించడంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఉద్యోగ సంఘ నాయకులు స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లెలో బుధవారం మునిసిపల్ రిటైర్డు ఉద్యోగ సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. ఉద్యోగులకు క్వార్టర్స్ అప్పగించే విషయమై ఇప్పటికే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలిసి చర్చిస్తే, సానుకూలంగా ఉన్నట్లు స్పష్టత ఇచ్చారన్నారు. వీలైనంత త్వరలోనే క్వార్టర్స్ ఫైలును ప్రభుత్వానికి పంపాలని కమిషనర్‌ను సైతం కోరామన్నారు. ఉద్యోగులంతా ఐకమత్యంగా ఉంటూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు భాస్కర్, గోవిందుడు, శ్రీనివాసులు, పయణి, చంద్రయ్య, పెంచులయ్య, వెంకటేశులు, సుగుణ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఐరాల: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సముపార్జించవచ్చని, విద్యార్థులు నిరంతరం పుస్తక పఠనం చేయాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం కోమల ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ఎర్రయ్య పాల్గొన్నారు.


విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- చిత్తూరు మండలంలోని ఓ డ్వాక్రా మహిళా సంఘం మూడేళ్ల కిందట రూ.10 లక్షలు బ్యాంకు నుంచి రుణం తీసుకుంది. ప్రతి నెలా విధిగా బ్యాంకుకు అప్పులు చెల్లిస్తూ వస్తోంది. అప్పు చెల్లింపులు పూర్తి కావడంతో సభ్యులంతా మళ్లీ బ్యాంకుకు రుణం వెళ్లారు. బ్యాంకు మేనేజర్ ఈ గ్రూపు మీద ఇంకా రూ.80 వేలు అప్పు ఉందని చూపించాడు. దీంతో సభ్యులు షాక్‌కుగురయ్యారు. మిగిలిన డబ్బులు బ్యాంకు మిత్రకు ఇచ్చామని, ఆమె చెల్లించలేదని చెప్పుకొచ్చారు. మిత్ర తనకు సంబంధం లేదని వాదించింది. దీంతో అప్పు పూర్తిగా చెల్లించాల్సిందేనని మేనేజర్ చెప్పడంతో చేసేదీ లేక సభ్యులంతా కలిసి అప్పు భారాన్ని తీర్చారు.



- తెనాలి గ్రూపునకు ఇటీవలే అప్పు పూర్తిగా తీరింది. కొత్తగా రుణం కావాలని బ్యాంకును సంప్రదించింది. రూ.20 లక్షలు రుణం కోసం డాక్యుమెంట్లు సమర్పించారు. సంఘ మిత్ర, బ్యాంకు అధికారి కలిసి నెల రోజుల పాటు ఆ గ్రూపు సభ్యులను తిప్పించుకున్నారు. తీరా సభ్యురాలికి రూ.10 వేల చొప్పున కమీషన్ ఇస్తామని చెప్పడంతో లోన్ మంజూరుకు అంగీకరించారు. రెండు రోజుల్లో సభ్యుల ఖాతాకు లోన్ నగదు జమ అయింది. డీల్ మేరకు వారికి రూ. 10 వేలు చొప్పున వసూలు చేసి ఇచ్చారు. దీంతో పాటు సంఘమిత్రకు బహుమతి షరా మూములేనని సభ్యులంతా కలిసి కొనిచ్చారు.

సంఘాలు.. కమీషన్ల దందాలు

డ్వాక్రా సంఘాల్లో రుణాల గోల్‌మాల్ పతాక స్థాయికి చేరింది. రుణమంటే సభ్యులకు రణంగా మారింది. కమీషన్లతోనే పనులవుతున్నాయి. దీనికి తోడు బహుమతులంటూ సంఘ మిత్రలు గుంజుకుంటున్నారు. నెలవారీ అప్పుల చెల్లింపులో చేతివాటం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఈ అక్రమాలపై ప్రభుత్వం నిఘా పెట్టింది. పర్యవేక్షణ కమిటీ వేస్తూ ఎప్పటికప్పుడు గోల్‌మాల్‌కు కళ్లెం వేస్తోంది. సంఘమిత్రలుగా పనిచేస్తూ, బ్యాంకు మిత్రగా పనిచేసేవారిని తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది.

- నెలవారీ చెల్లింపుల్లో సంఘ మిత్రల చేతివాటం
- రుణమంటే గ్రూపు సభ్యులకు రణమే
- అక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా
- బ్యాంకు మిత్రగా పనిచేస్తే తొలగించాలని ఆదేశం

చిత్తూరు రూరల్: చిత్తూరు, గుడిపాల మండలాల్లో 58 గ్రామ సమాఖ్యలున్నాయి. ఈ సమాఖ్య కింద 1,566 గ్రూపులు, 16,387 మంది సభ్యులున్నారు. వీరికి 15 బ్యాంకులు రుణాలిస్తూ చెల్లించుకుంటున్నాయి. ఈ ఏడాది బ్యాంకు రుణం కింద పలు గ్రూపులకు రూ.39.38 కోట్లు మంజూరయ్యాయి. బ్యాంకు అప్పు నిల్వ రూ.98.75 కోట్ల వరకు ఉంది. ఉన్నతి ద్వారా రూ.44.23 లక్షలు ఇవ్వగా, రూ.1.12 కోట్లు అప్పు నిల్వలు ఉన్నాయి. స్త్రీ నిధి రూ.78.27 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇక రూ. 5.50 కోట్ల మేర అక్రమాల్లో మునిగినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.



సభ్యులకు చెల్లింపు కష్టాలు

డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నవారిలో అధిక శాతం మంది నిరాక్షరాస్యులు, మధ్య తరగతి కుటుంబానికి చెందినవారే. వీరు డ్వాక్రా సంఘాల ద్వారా పలు రుణాలు తీసుకుంటూ కుటుంబ జీవనానికి, అవసరాల నిమిత్తం వాడుకుంటున్నారు. అప్పులు తీసుకోవడం, నెలవారీగా బ్యాంకులకు చెల్లించడం విధిగా చేస్తుంటారు. తినడానికి తిండికి లేకపోయినా పది మందిలో పరువు పోతుందని చెల్లింపు తేదీ కల్లా అష్టకష్టాలు పడి చెల్లిస్తుంటారు. కానీ కొందరు సంఘమిత్రలు, బ్యాంకు మిత్రలు, సిబ్బంది మాత్రం దర్జాగా చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

డ్వాక్రా సంఘాలపై నిఘా...

డ్వాక్రా సంఘాల్లో జరుగుతున్న అక్రమాలు, అవినీతిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సంఘాలపై నిఘా పెట్టింది. లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపడుతోంది. ఇటీవల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రతి నెలా గ్రూపు చెల్లింపులు, దానికి సంబంధించిన రికార్డులు, బ్యాంకు స్లిప్పులు క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. తద్వారా చాలా వరకు వసూళ్లు, తగ్గుముఖం పట్టాయి. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు మిత్రలుగా పనిచేస్తున్న సంఘమిత్రలను తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. మళ్లీ అక్టోబర్ 19వతేదీ కూడా మరోసారి స్పష్టం చేసింది. దీంతో అధికారులు అలాంటి వారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అధికారులకే తెలియకుండా గుడిపాల, చిత్తూరు మండలాల్లో ఏడుగురు సంఘ మిత్రలు, బ్యాంకు మిత్రలుగా కొనసాగుతున్నట్లు జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి.

- **అక్రమాలు ఇలా ..**

రుణం తీసుకున్నప్పటి నుంచి ఆ అప్పులు చెల్లించే వరకు సంఘమిత్రలు, బ్యాంకు మిత్రలు, సిబ్బంది చేసే అక్రమాలకు సభ్యులు బలవుతున్నారు. బ్యాంకు రుణం మంజూరు చేస్తే సభ్యురాలే రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు కమీషన్ ఇవ్వాలి. ఈ నగదులో కొందరు బ్యాంకు అధికారులు, సంఘమిత్రలు, సభ్యులు వాటాలు పంచుకుంటున్నారు. ఉన్నతి, స్త్రీనిధి కూడా కమీషన్లు ఇవ్వందే పనులు జరగడం లేదు. మామూళ్లు ఇవ్వకపోతే ఈ గ్రూపు సభ్యులకు సవాలక్ష నిబంధనలు పెట్టడం, వారిని బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటారు. ఇది కాకుండా అప్పులు చెల్లించే క్రమంలో కొందరు గ్రూపు లీడర్లు, సంఘమిత్రలు, బ్యాంకు మిత్రలు గోల్‌మాల్ చేస్తున్నారు. లేకుంటే వడ్డీలకు ఇచ్చుకుంటూ ఆలస్యంగా బ్యాంకుకు చెల్లిస్తున్నారు. మధ్యలో పూర్తిగా చెల్లించకుండా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తద్వారా సభ్యులకు వడ్డీ భారం, మరింత అప్పుల భారం పడడంతో నలిగిపోతున్నారు. కట్టిన నగదుకు రసీదులు ఇవ్వడం లేదని చాలా చోట్ల ఫిర్యాదులు ఉన్నాయి. స్త్రీ నిధి, ఉన్నతిలో కూడా కొందరు సంఘమిత్రలు, మహిళా సమాఖ్య సిబ్బంది కమీషన్లు వసూలు చేస్తున్నారని సభ్యులు వాపోతున్నారు.

ఫిర్యాదులొస్తే విధుల నుంచి తప్పిస్తాం



ప్రతి గ్రూపును నిశితంగా పరిశీలించి, వారి జమ, చెల్లింపులను చూడాల్సిన బాధ్యత పర్యవేక్షణ కమిటీలపై ఉంది. ఈ విషయంలో పర్యవేక్షణ కమిటీ నిర్లక్ష్యం చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. బ్యాంకు మిత్రలుగానూ పనిచేస్తూ, సంఘమిత్రలుగా ఉంటే ఎట్టి పరిస్థితుల్లోను ఊరుకోను. డ్వాక్రా నగదు చెల్లింపులో సంఘమిత్రలు, బ్యాంకు మిత్రల చేతి వాటం ఉందని ఫిర్యాదు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదు. విధుల నుంచి తప్పిస్తాం.

– విజయభాస్కర్, ఏపీఎం, చిత్తూరు మండలం

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బంగారుపాళెం: స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అకౌంట్స్ అండ్ టాక్సేషన్(ఒకేషనల్) కోర్సు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గిరిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంకాం టాక్సేషన్ స్పెషలైజేషన్ గల అభ్యర్థులు పోస్టుకు అర్హులని తెలిపారు. ఈ నెల 25వ తేదీ లోపు అభ్యర్థులు తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని ప్రిన్సిపల్ కోరారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ


విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు

పూతలపట్టు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గత నెలలో పరీక్షలు చేశారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి 24 మందికి బుధవారం పాఠశాలలో కళ్లద్దాలను ఆశావర్కర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశావర్కలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యాదమరి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక గ్రంథాలయ అధికారి మధు ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రంథాలయ అవశ్యకత, జగనన్న విద్యా దీవెన అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ, డ్రాయింగ్ మాస్టర్ దామోదరాచారి పాల్గొన్నారు.

---

150 మందికి వైద్య పరీక్షలు



జొన్నగురకలలో వైద్య పరీక్షలు చేస్తున్న ప్రియాంక, గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ అనూష

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారులు ప్రియాంక, వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొండ్రాజుకాలువ, వెంగంపల్లె గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మాత్రలు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. మరకాలకుప్పం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె 55 మందికి చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి, యమున, శ్రీలత, దివ్య, దేవప్రీత పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావాలని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో ప్రణాళిక ప్రకారం కొత్త ఓటర్ల నమోదు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఏఈఆర్వో, కమిషనర్ అరుణ సూపర్ వైజర్లను ఆదేశించారు. ఓటు నమోదు అవగాహన కార్యక్రమాల నిర్వహణపై బుధవారం నగరపాలక కార్యాలయంలో సూపర్ వైజర్లతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1 జనవరి 2024 కు 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఇందుకోసం అధికారులకు కేటాయించిన విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అక్కడికక్కడే అర్హులైన విద్యార్థులతో ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేయించాలని చెప్పారు. విద్యాసంస్థల్లో రోజువారీ కార్యక్రమాల నిర్వహణపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

నగర పాలక సంస్థ పరిధిలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. హౌసింగ్ పురోగతిపై బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరపాలక పరిధిలోని అన్ని లేఔట్లలో ప్రస్తుతం జరుగుతున్న పనులు మరింత వేగవంతం చేయించాలన్నారు. బీఎల్, ఆర్‌ఎల్, ఆర్సీ దశలో ఉన్న నిర్మాణాలను డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయించేలా లబ్ధిదారులను సమన్వయం చేయాలన్నారు. రోజువారీ నిర్మాణ పనులు జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఎంహెచ్వో డా.లోకేష్, సూపర్‌వైజర్ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

గుడిపాల: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి అని తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో సీఎన్‌ఆర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు పెరిగి పెద్ద చెట్టుగా మారి ప్రకృతికి ఉపయోగపడుతాయని చెప్పారు. చెట్లు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమన్నారు. చెట్ల వల్లనే ఈ పచ్చని భూమి, మన జీవితం ఆనందంగా ఉంటాయన్నారు. చెట్లవలన గాలి, నీడ, పక్షులకు ఆహారం, నివాసానికి ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ లోకేష్ మాట్లాడుతూ మానవుని మనుగడకు చెట్లు చాలా ముఖ్యమైనవని వర్షాలు, పంటలు, కాలుష్యం నుంచి కాపాడి పర్యావరణాన్ని రక్షిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకురాలు మీనాకుమారి, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్

నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

- సచివాలయాల స్థాపనతో లక్షలాది ఉద్యోగాలు
- నగర ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' (వై ఏపీ నీడ్స్ జగన్) అనే కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ బుధవారం కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం అన్ని రంగాల్లో రాణించాలంటే జగనన్న నాయకత్వం ఎంత అవసరమో వివరించారు. గత ప్రభుత్వ సమయంలో వ్యవసాయం, విద్య, ఉద్యోగ, పరిశ్రమల స్థాపన, పథకాలు, ఆరోగ్యం, తలసరి ఆదాయం, వృద్ధిరేటులో వెనుకపడిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగలేదని స్పష్టం చేశారు. సచివాలయాల స్థాపన ద్వారా లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు ఇవ్వడం, ఇజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, వ్యవసాయం, పరిశ్రమల స్థాపనలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. టీడీపీ 2014 ఎన్నికల్లో 600 హామీలిచ్చి, జనసేన. బీజేపీ మద్దతుతో అనుభవం పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. ఇప్పుడు జనసేన పొత్తుతో ప్రజలను మోసం చేయాలని చూస్తోందన్నారు. వారిని ప్రజలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమవుతుందన్నారు. చిత్తూరు నగరంలోని మురకంబట్టు, టెలిఫోన్‌కాలనీ, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో మధ్యాహ్నం పైన ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కార్యక్రమం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. తొలుత సచివాలయాల్లో ప్రజలు పొందిన లబ్ధిని తెలిపే డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తామన్నారు. తర్వాత ఆ ప్రాంతంలోని కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తామన్నారు. తటస్థులతో సమావేశమై వారితో భోజనం చేసి రాత్రి అక్కడ బస చేస్తామన్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, జెండాలు ఇవ్వడం చేస్తామన్నారు. రోజు పది నివాసాలు కచ్చితంగా తిరుగుతారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, గుడిపాల పార్టీ అధ్యక్షులు జనార్దన్, చిత్తూరు పార్టీ రూరల్ అధ్యక్షుడు త్యాగ, నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్ నాయకులు అల్తాఫ్, సంతోష్ పాల్గొన్నారు.

నేడు కె.పట్నం సచివాలయంలో ..

తవణంపల్లె: మండలంలోని కె. పట్నం సచివాలయంలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు సి.హరిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ, గ్రామ పెద్దలతో కలసి రాత్రి బస, ఇంటింటికీ తిరిగి ప్రచారం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టపాసుల విక్రయాలపై జాగ్రత్తలు పాటించండి

కుప్పం: దీపావళి పండుగను పురస్కరించుకుని టపాసుల విక్రయాలపై వ్యాపారస్తులు నిబంధనలతోపాటు తగిన జాగ్రత్తలు పాటించాలని పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా ఇక్కడికి వచ్చారు. పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ దుకాణాల ప్రాంతాన్ని, దుకాణదారుల లైసెన్సులను ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టపాసులు విక్రయించాలని సూచించారు. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ శ్రీధర్, ఎస్‌ఐ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలశుద్ధి కేంద్రంలో నీటి దీపావళి


జలశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెప్మా సభ్యులు

పలమనేరు: స్థానిక ఎద్దుల సంతవీధిలోని నీటి శుద్ధి కేంద్రంలో బుధవారం నీటి దీపావళి కార్యక్రమాన్ని మెప్మా ఘనంగా నిర్వహించింది. మెప్మాలోని యాభైమంది గ్రూపు లీడర్లను అక్కడికి తీసుకెళ్లి నీటిని శుద్ధి చేసి మినరల్ వాటర్‌గా ఎలా తయారు చేస్తారో ప్రత్యక్ష్యంగా అవగాహన కల్పించారు. అనంతరం వారికి మంచినీటి కిట్లను పంపిణీ చేశారు. మండలంలోని కాలువపల్లె వద్ద ఉన్న వైఎస్సార్ జలశయం నుంచి పంపిణీ చేసి నీటిని ఇక్కడ శుద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

వైఎస్సార్ ఆశయాల సాధనకు కృషి

ఐరాల: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని మట్టపల్లెలో రూ.17.5 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం స్థానిక సర్పంచ్ మునిరత్నం, వైస్ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు పక్కా భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యాన్ని మెరుగైన రీతిలో అందించాలన్న లక్ష్యంతో జగనన్న విప్లవాత్మక మార్పులకు నాంది పలికారన్నారు. ప్రజల చెంతకే వైద్యసేవలందించాలన్నదే ముఖ్యమంత్రి అభిమతమని పేర్కొన్నారు. ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 65 రకాల మందులతో పాటు బేసిక్ మెడికల్ ఎక్విప్‌మెంట్, టెలీ మెడిసిన్ సైతం అందుబాటులో ఉంటాయని తెలిపారు. 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.


మట్టపల్లెలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో గ్రామీణ ప్రజలకు ఉపయోగకరం

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు గ్రామీణ ప్రజలకు ఉపయోగకరమని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో చిన్నపాటి అనారోగ్యం వచ్చినా ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2500 మంది జనాభా కలిగిన ప్రతి గ్రామంలో ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి(బుజ్జిరెడ్డి), ఎంపీపీ మోహన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతలు, మండల అధికారులు పాల్గొన్నారు.